శ్రీ రాజరాజేశ్వరి అలంకారంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



04

RNI: APTEL/26/A8235

# అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

అక్షర దర్శిని

దినపత్రికలో పని చేయడానికి అనుభవం కలిగిన, జర్నలిజంపై ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను. కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090
8374168090

నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -17 | గురువారం 15 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్నయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-



## రైతుల భూ హక్కులకు రాజముద్రతో భరోసా

- ఇందుకూరుపేట మండలంలో 8,394 పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ పూర్తి
- గంగపట్నం, రాముడిపాళెంలో 1,251 మంది రైతులకు పాసు పుస్తకాలు అందజేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**ఇందుకూరుపేట,(అక్షర దర్శిని) :** రైతుల భూమిపై హక్కులను ధ్రువీకరిస్తూ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను అందించాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ మేరకు కూటమి ప్రభుత్వం 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. బుధవారం ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం, రాముడిపాళెం గ్రామాల్లో 1,251 మంది రైతులకు ఆమె పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని 16 గ్రామాలకు మొత్తం 8,394 కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరయ్యాయని, దీంతో మండలంలో భూముల రీ-సర్వే ప్రక్రియతో పాటు పాసు పుస్తకాల పంపిణీ కూడా పూర్తయిందని వెల్లడించారు.

**రైతుల భూ హక్కులకు భరోసా**

గతంలో భూముల విషయంలో చోటుచేసుకున్న అవకతవకలను రీ-సర్వే ద్వారా సరిచేస్తూ, రైతులకు వారి భూములపై హక్కులను ధ్రువీకరించే పాసు పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను పంపిణీ

...మిగతా 2లో



# నెల్లూరులో అభివృద్ధి జాతర!

ఒకేరోజు రూ.4 కోట్లతో పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

డిసెంబర్ నాటికి ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్.. జూన్ 12 నాటికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి

రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు రూ.50 వేల కోట్లు: మంత్రి నారాయణ

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగరాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో బుధవారం తొమ్మిది డివిజన్లలో పర్యటించిన ఆయన సుమారు రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా నగరంలో తాగునీరు, డ్రైనేజీ, పార్కులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.50 వేల కోట్లు కేటాయించారని మంత్రి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత భారీ

...మిగతా 3లో



# స్థానిక పోరుకు సిద్ధంగా ఉన్నాం

ప్రజలు వైసీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు: కాకాణి

టీడీపీ ఓటమి భయంతోనే ప్రతిపక్ష నేతలపై కేసులు, బెదిరింపులు, ఆరోపణ



**ముత్తుకూరు,(అక్షర దర్శిని) :** స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, అయితే ఓటమి భయంతో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రతిపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంతో పాటు వెంకటాచలం మండలం సరస్వతీనగర్‌లో కాకాణి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

...మిగతా 2లో

04



## స్థానిక సంస్థల ఎన్నికలకు పోలీసు యంత్రాంగం సన్నద్ధం





## బుచ్చిరెడ్డిపాలెంలో సీపీఎం నాయకులతో నల్లపరెడ్డి భేటీ

▶▶ వైసీపీ చైర్మన్ అభ్యర్థి షేక్ షకీలా బేగంకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి

**బుచ్చిరెడ్డిపాలెం,(అక్షర దర్శిని) :** బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సీపీఎం నాయకులతో సమావేశమయ్యారు. బుచ్చిరెడ్డిపాలెంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ భేటీలో మున్సిపల్ ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా వైసీపీ తరఫున పోటీ చేస్తున్న షేక్ షకీలా బేగంతో పాటు 28 వార్డుల్లో పోటీ చేయనున్న వైసీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని సీపీఎం నాయకులను నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కోరారు. ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జునరావు, సీపీఎం పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు, ఆవాజ్ మండల అధ్యక్షులు షేక్ జానీ బాయ్‌తో పాటు పలువురు సీపీఎం సీనియర్ నాయకులు పాల్గొన్నారు. వైసీపీ నాయకులు వీరి చలపతిరావు, గొల్లపల్లి విజయకుమార్, మవులూరు శ్రీనివాసులురెడ్డి, షేక్ షాహుల్, చెర్లో సతీష్ రెడ్డి, కోడూరు మధుసూదన్ రెడ్డి, కందుకూరి యానాది రెడ్డి, మోర్ల భరత్, కడివేటి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ అల్లాబక్షు, రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, బిట్రగుంట నారాయణ, కంటా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.





## పెంచలకోన లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం రూ.1.01 కోట్లు..





▶▶ 74 రోజుల హుండీ లెక్కింపులో రూ.97.95 లక్షల నగదు..

▶▶ విదేశీ కరెన్సీ, బంగారం, వెండి ఆభరణాలు..

**పెంచలకోన,(అక్షర దర్శిని) :** నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో 74 రోజుల హుండీ ఆదాయం రూ.1,01,07,774గా నమోదైంది. జూలై 29 నుంచి అక్టోబర్ 14 వరకు స్వామివారు, అమ్మవారు, ఆంజనేయస్వామి ఆలయాల్లోని హుండీలను లెక్కించగా ఈ ఆదాయం సమకూరినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి బుధవారం తెలిపారు. హుండీల ద్వారా కరెన్సీ రూపంలో రూ.89,44,751, నాణేల రూపంలో రూ.8,50,585 కలిపి మొత్తం రూ.97,95,336 నగదు లభించింది. మిక్స్‌డ్ బంగారు ఆభరణాలు 201 మిల్లీగ్రాములు, వెండి ఆభరణాలు 2,530 మిల్లీగ్రాములు లభించాయి. అమెరికా డాలర్లు, కువైట్ దినార్లు, సింగపూర్ డాలర్, యూరో తదితర విదేశీ కరెన్సీ కూడా హుండీల్లో లభించినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి సంబంధించిన హుండీల ద్వారా 74 రోజులకు రూ.3,12,438 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని కలుపుకొని మొత్తం ఆదాయం రూ.1,01,07,774కు చేరింది. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ లెక్కింపులో జొన్నవాడ దేవస్థానం సహాయ కమిషనర్ ఏవీ శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు జిల్లా డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు, పెంచలకోన ఔట్‌పోస్ట్ పోలీసు సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు పెంచలకోన శాఖ మేనేజర్, సిబ్బంది, ఎస్‌బీఐ రిటైర్డ్ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది, సేవార్థులు పాల్గొన్నారు. హుండీల ద్వారా లభించిన నగదును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు పెంచలకోన శాఖలో జమ చేసినట్లు ఈవో తెలిపారు.

## కండలేరుకు నికర జలాలు రప్పించాలి!



▶▶ అంతర్రాష్ట్ర ఒప్పందాల ప్రకారం కృష్ణా జలాలు విడుదల చేయాలి..

▶▶ ఎగువ రాష్ట్రాలతో చర్చించి నెల్లూరు రైతుల హక్కులు కాపాడాలి..

▶▶ బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్..

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** అంతర్రాష్ట్ర ఒప్పందాల ప్రకారం కండలేరు జలాశయానికి కృష్ణా నికర జలాలను రప్పించి, అక్కడి నుంచి చెన్నైకి తాగునీరు విడుదల చేయాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కండలేరు డ్యామ్‌లో నీటి నిల్వలను బుధవారం ఆయన బిజెపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విడతల రమేష్ మాట్లాడుతూ జలాశయాల్లో నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. 1975లో చెన్నై నగరానికి తాగునీరు అందించేందుకు అంతర్రాష్ట్ర ఒప్పందాలు జరిగాయని తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కృష్ణా జలాల వాటాలను ఒప్పందాల ప్రకారం కండలేరు జలాశయానికి తీసుకురావాల్సి ఉందన్నారు. అయితే ఎగువ రాష్ట్రాల నుంచి నికర జలాలు విడుదల కావడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలతో చర్చించి కండలేరుకు రావాల్సిన నీటిని సాధించాలని డిమాండ్ చేశారు. ఈ జల సంవత్సరంలో శ్రీశైలం నుంచి సోమశిల, కండలేరు జలాశయాలకు ఒక్క చుక్క నీరు కూడా విడుదల కాలేదని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఏటా ఉమ్మడి నెల్లూరు జిల్లా రైతుల నీటి హక్కులకు విఘాతం కలుగుతున్నప్పటికీ, మానవతా దృక్పథంతో కండలేరు నుంచి చెన్నైకి తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ఒకవైపు జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోతుండగా, మరోవైపు చెన్నై తాగునీటి అవసరాలను తీర్చాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మహారాష్ట్రలోని కొయినా డ్యామ్ నుంచి విద్యుదుత్పత్తి పేరుతో భారీ మొత్తంలో నీరు సముద్రంలోకి వెళ్తోందని, ఈ అంశాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎగువ రాష్ట్రాల దృష్టికి తీసుకెళ్లాలని రమేష్ సూచించారు. ఒప్పందాల ప్రకారం రావాల్సిన నికర జలాలను సాధించకుండా వెలిగొండ, నల్లమలసాగర్ ప్రాజెక్టులకు నీటిని తరలించే అంశంపై ముందుకు సాగడం సమంజసం కాదన్నారు. కండలేరు జలాశయానికి చట్టబద్ధంగా రావాల్సిన నీటిని రాబట్టుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. నెల్లూరు జిల్లా రైతుల ప్రయోజనాలను కాపాడటంతోపాటు చెన్నై తాగునీటి అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఎగువ రాష్ట్రాలతో చర్చలు జరిపి కృష్ణా నికర జలాలను కండలేరుకు రప్పించిన అనంతరం, ఒప్పందాల ప్రకారం చెన్నైకి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నరాల సుబ్బారెడ్డి, సృజన, ఆదినారాయణ, పెంచలయ్య, వెంకటరత్నం నాయుడు, వాకా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూ హక్కులకు రాజముద్రతో భరోసా

చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు తమ భూములపై హక్కుల విషయంలో మరింత భరోసా కలుగుతుందని పేర్కొన్నారు.

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం** రైతులందరూ సుభిక్షంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా వరుణ యాగాలు నిర్వహించినట్లు చెప్పారు. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటం సంతోషకరమన్నారు. గత పంటల సీజన్‌లో మంచి దిగుబడులు రావడంతో రైతులకు మెరుగైన ఆదాయం లభించిందని గుర్తుచేశారు. ప్రస్తుత సీజన్‌లోనూ సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రైతులకు మంచి దిగుబడులతో పాటు మెరుగైన ఆదాయం లభించాలని ఆకాంక్షించారు.

## స్థానిక పోరుకు సిద్ధంగా ఉన్నాం



పోలీసు కేసులు, బెదిరింపులు, బైండోవర్ కేసుల పేరుతో ప్రతిపక్ష నాయకులను వేధిస్తున్నారని విమర్శించారు. నామినేషన్లకు అవసరమైన పత్రాలు అందకుండా చేయడం, అధికారులను బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

**చంద్రబాబు పాలనపై ప్రజల్లో వ్యతిరేకత** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని కాకాణి విమర్శించారు. ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో ఎలాగైనా పైచేయి సాధించినట్లు చూపించుకోవాలనే ఉద్దేశంతో అధికార పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల ఫలితాలు తెలుగుదేశం పార్టీకి గట్టి గుణపాఠం చెబుతాయని వ్యాఖ్యానించారు.

**జగన్ పాలనలో సంక్షేమానికి ప్రాధాన్యం** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గ్రామస్థాయిలో ప్రజలకు సంక్షేమ పథకాలు చేరాయని కాకాణి తెలిపారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు సేవలు అందించడంతో పాటు వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలు పెరిగాయని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం మాటలకే పరిమితమవుతోందని, జగన్ పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా చేయూత లభించిందని అన్నారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు మధ్య ప్రజలు తేడాను గమనిస్తున్నారని, జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నారని కాకాణి పేర్కొన్నారు.

**నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి** స్థానిక ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా రాజ్యాంగబద్ధంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని కాకాణి కోరారు. అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం, కింది స్థాయి అధికారులను బెదిరించడం వంటి చర్యలకు స్వస్తి పలకాలని సూచించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ న్యాయబద్ధంగా వ్యవహరించి ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ తరఫున విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

కాకాణి పర్యటనలో భాగంగా సరస్వతీనగర్‌లో నూతన దంపతులు నాసిన రాజేష్, దివ్యలను ఆశీర్వదించారు. అనంతరం తాటిపర్తి చిన్నరాగయ్యకు నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



# నిత్యావసర సరుకులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



- ▶▶ బ్లాక్ మార్కెట్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదు
- ▶▶ పండుగ వేళ పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ధరలు ఉండాలి: జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** విజయదశమి పండుగ నేపథ్యంలో నిత్యావసర సరుకులను ప్రజలకు అందుబాటు ధరల్లో విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించినా, బ్లాక్ మార్కెట్‌కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బియ్యం, పప్పులు, వంటనూనెలు, కూరగాయల ధరలను నియంత్రించేందుకు వ్యాపారులు సహకరించాలని సూచించారు. బుధవారం నెల్లూరు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన ప్రాంగణంలో నిత్యావసర సరుకుల ధరల నియంత్రణపై సంబంధిత అధికారులు, మిల్లుల యజమానులు, హోల్‌సేల్ వ్యాపారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలు, నిల్వలు, విక్రయాల పరిస్థితిపై సమీక్షించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారం పడకుండా సరుకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యాపారులకు సూచించారు.

**రైతు బజార్లలో తక్కువ ధరలకు సరుకులు** రైతు బజార్లలో ప్రస్తుతం విక్రయిస్తున్న బియ్యం ధరలు, నిల్వల వివరాలను మార్కెటింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బియ్యంతో పాటు ఎర్రగడ్డలు, కందిపప్పును కూడా తక్కువ ధరలకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూరగాయల ధరలు నియంత్రణలో ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**నిరంతరం తనిఖీలు నిర్వహించాలి** పండుగ సమయంలో నిత్యావసర



సరుకుల ధరలు పెరగకుండా పౌరసరఫరాలు, తూనికలు--కొలతలు, మార్కెటింగ్ శాఖల అధికారులు ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. వస్తువుల నిల్వలు, ధరలు, తూకాల్లో అక్రమాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని అమలు చేయడంతో పాటు, ప్రజలకు నాణ్యమైన సరుకులు అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఇండ్ల పుల్లయ్య, సహాయ పౌరసరఫరాల అధికారి చల్లా లక్ష్మీనారాయణరెడ్డి, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి పి.అనితాకుమారి, తూనికలు--కొలతల శాఖ జిల్లా అధికారి టి.రాంబాబు, ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటేశ్వరరావు, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, బియ్యం, పప్పులు, వంటనూనెల మిల్లుల యజమానులు, హోల్‌సేల్ వ్యాపారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరులో అభివృద్ధి జాతర!









**మొదటి పేజీ తరువాయి**

స్థాయిలో నిధులు కేటాయించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించామని చెప్పారు.

**డిసెంబర్ నాటికి ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్** నెల్లూరు నగర ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి నగరంలోని ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించి సంగం బ్యారేజీ నీటిని సరఫరా చేస్తామని ప్రకటించారు. సుమారు రూ.800 కోట్లతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను వచ్చే ఏడాది జూన్ 12 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి నెల్లూరును దోమలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని, నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

**పార్కుల ప్రారంభోత్సవాల్లో సందడి** నగరంలో పలు పార్కులు, ప్రజా సదుపాయాల ప్రారంభోత్సవాల్లో మంత్రి నారాయణ ఉత్సాహంగా పాల్గొన్నారు. నాలుగో డివిజన్‌లోని ఎన్టీఆర్ పార్కును ప్రారంభించిన అనంతరం చిన్నారులతో ముచ్చటించి చాక్లెట్లు పంపిణీ చేశారు. పార్కులో బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతూ క్రీడాకారులతో సరదాగా గడిపారు. మంత్రి ఆటల్లో పాల్గొనడంతో అక్కడి క్రీడాకారులు, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. జగదీష్ నగర్‌లో నూతనంగా నిర్మించిన పార్కుతో పాటు ఏసీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఈ కమ్యూనిటీ హాల్‌ను కేవలం రూపాయి అద్దెతో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ముత్తుకూరు గేట్ సెంటర్‌లో ఆధునిక హంగులతో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్‌ను ప్రారంభించారు.

**నెల్లూరు రూపురేఖలు మారుస్తాం** రాబోయే నెలల్లో నెల్లూరు నగర రూపురేఖలు మారనున్నాయని మంత్రి నారాయణ ధీమా వ్యక్తం చేశారు. తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలతో పాటు పార్కులు, క్రీడా ప్రాంగణాలు, ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన పట్టణ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి పార్టీల మధ్య చర్చలు పూర్తయిన తర్వాతే అభ్యర్థులను ప్రకటిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో నెల్లూరు మేయర్ దేవరకొండ సుజాత, కార్పొరేషన్ ఎస్ఈ జానీ, హెల్త్ ఆఫీసర్ దినేష్ కుమార్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నగర పార్టీ అధ్యక్షుడు మామిడాల మధు, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, వివిధ డివిజన్ల కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# వైసీపీకి ఓటమి భయం.. అందుకే ఆరాటం

- ▶▶ రిజర్వేషన్లు రోస్టర్ ప్రకారమే ఖరారు చేశాం
- ▶▶ ఎన్నికల ప్రక్రియ చట్టబద్ధంగా, పారదర్శకంగా సాగుతోంది: మంత్రి నారాయణ

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తీవ్రంగా ఖండించారు. వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు పూర్తిగా చట్ట నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు నిరాధార విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియలో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని మంత్రి తెలిపారు. నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు కలెక్టర్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

**రోస్టర్ ప్రకారమే రిజర్వేషన్లు** నెల్లూరు మేయర్ స్థానం ఓసీ జనరల్‌కు కేటాయించడంపై వస్తున్న విమర్శలపై మంత్రి స్పందిస్తూ, రిజర్వేషన్లు రోస్టర్ విధానం ప్రకారమే ఖరారయ్యాయని తెలిపారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ బీసీ కోటాలో పోటీ చేయాలనుకున్నంత మాత్రాన రిజర్వేషన్లలో మార్పులు చేయలేదని స్పష్టం చేశారు.

తన సొంత నియోజకవర్గంలోనూ పలు డివిజన్ల రిజర్వేషన్లు మారినప్పటికీ తాము ఎలాంటి జోక్యం చేసుకోలేదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

**టీవీ ప్రచారం కోసమే విమర్శలు** వైసీపీ నాయకులు కేవలం టీవీ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారాలు, పత్రికల్లో ప్రచారం పొందేందుకే ఆరోపణలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు ఆ పార్టీ నేతలు ఆరాటపడుతున్నారని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనవసర అపోహలు సృష్టించవద్దని సూచించారు.

**మంచి చేసేవారికే ఓటేయండి** మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ఎన్నికల్లో పాల్గొని, తమకు మంచి చేసే అభ్యర్థులను గుర్తించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చట్ట నిబంధనలను గౌరవించాలని కోరారు.

# కార్పొరేషన్ ఎన్నికల వేళ వైసీపీలో వరుస చేరికలు

- ▶▶ ఆనం విజయకుమార్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరిన మాజీ కార్పొరేటర్ తురకా సూరిబాబు

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పాత 30వ డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్, టీడీపీ సీనియర్ నాయకుడు తురకా సూరిబాబు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, నెల్లూరు నగర మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డి సమక్షంలో తురకా సూరిబాబు పార్టీలో చేరారు. ఈ పరిణామం కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల వేళ వివిధ పార్టీల నాయకులు తమ రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో తురకా సూరిబాబు వైఎస్సార్‌సీపీలో చేరడం చర్చనీయాంశంగా మారింది.





# యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

▸ ముగ్గురు నిందితుల అరెస్ట్.. కత్తి, మారణాయుధాలు స్వాధీనం

▸ మరో నిందితుడి కోసం గాలింపు ముమ్మరం: రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లూరుపల్లి ఆర్డీటీ కాలనీలో సంచలనం సృష్టించిన యువకుడు బట్టా వరుణ్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉండటంతో అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు వెల్లడించారు. బుధవారం నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సీహెచ్ సౌజన్య సూచనలతో, డీఎస్పీ పర్యవేక్షణలో రూరల్ సీఐ కె. వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

**కుటుంబ వివాదాలే కారణం** ప్రాథమిక దర్యాప్తులో కుటుంబ కక్షలు, వ్యక్తిగత వివాదాలే హత్యకు కారణమని పోలీసులు గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు. స్థానిక సమాచారం, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ కేసులో తమిళనాడు రాష్ట్రం గుమ్మిడిపూండి ఎంజీఆర్ నగర్‌కు చెందిన పి. కృష్ణ, ఎన్నూర్‌కు చెందిన జి. నాగరాజు, తిరువళ్లూరుకు చెందిన జె. కార్తీక్‌లను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో సంబంధం ఉన్న మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు గాలింపు ముమ్మరం చేశామని పేర్కొన్నారు.

**పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు** హత్య కేసును వేగంగా దర్యాప్తు చేసి నిందితులను గుర్తించడంలో ప్రతిభ కనబరిచిన రూరల్ సీఐ కె. వెంకటరెడ్డి, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్, ఇతర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. కుటుంబ వివాదాలు, వ్యక్తిగత కక్షలు హింసాత్మక ఘటనలకు దారితీయకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని పోలీసు శాఖ సూచించింది. ఎలాంటి సమస్యలున్నా చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని, అనుమానాస్పద పరిస్థితులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేసి పోలీసులకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# కలువాయి మండలంలో ఎంపీటీసీ రిజర్వేషన్లు ఖరారు

▸ 12 స్థానాలకు కేటాయింపులు..

ఆశావహుల్లో మొదలైన రాజకీయ సందడి

**కలువాయి,(అక్షర దర్శిని) :** నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో 2026 ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి 12 ప్రాదేశిక నియోజకవర్గాల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, జనరల్ కేటగిరీల వారీగా స్థానాలను కేటాయించారు. రిజర్వేషన్ల వివరాలు వెలువడటంతో ఆయా స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు తమ రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.

రిజర్వేషన్ల వివరాలు ఇవీ..
ఎస్టీ కేటగిరీ–దాచూరు
ఎస్సీ కేటగిరీ–మదన్నగారిపల్లి
ఎస్సీ మహిళ
తెలుగురాయపురం,కేసమనేపల్లి
బీసీ కేటగిరీ–కలువాయి––2
బీసీ మహిళ–ఉయ్యాలపల్లి
జనరల్ మహిళ
బద్దెవోలు,కనుపూరుపల్లి,చీపినాపి
జనరల్ కేటగిరీ
కుళ్లూరు,తూపుగుంట,కలువాయి––1

మొత్తం 12 ఎంపీటీసీ స్థానాల్లో ఒకటి ఎస్టీకి, మూడు ఎస్సీ కేటగిరీకి, రెండు బీసీ కేటగిరీకి, ఆరు జనరల్ కేటగిరీకి కేటాయించినట్లు వివరాలు వెల్లడయ్యాయి. ఆయా రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక, పోటీపై స్థానికంగా రాజకీయ చర్చలు మొదలయ్యాయి. ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగుతున్న కొద్దీ గ్రామాల్లో రాజకీయ సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి.

# శ్రీ రాజరాజేశ్వరి అలంకారంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు





▸ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల పూజలు..

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో కొలువుదీరిన ప్రసిద్ధ శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉదయం ఆలయ ప్రాంగణంలో మూలవిరాట్టుకు అర్చకులు శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ప్రత్యేకంగా గాజులతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులకు అమ్మవారి అనుగ్రహం కలగాలనే సంకల్పంతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం తెలిపారు.

ఈ సందర్భంగా కోట సూర్యనారాయణ, లక్ష్మీకుమారి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన భరతనాట్యం, అన్నమాచార్య కీర్తనలు, వాసవి మాత భక్తిగీతాల కార్యక్రమాలు భక్తులను అలరించాయి. వేదమంత్రోచ్చారణలు, 'జై వాసవి మాత' నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు కొండ ప్రవీణ్ శంకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు



షణ్ముగరావు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి జనార్దన్‌రావు, ఉపాధ్యక్షుడు వేముల ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మునగ వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారు ఆంజనేయులు, వాయుగుండ్ల బ్రహ్మయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భక్తుల రాకతో ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పోలీసు యంత్రాంగం సన్నద్ధం






–సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాల గుర్తింపునకు ఆదేశాలు
–ఎన్నికల భద్రతపై సౌత్ కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సమీక్ష

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** స్థానిక స్వపరిపాలన సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని సౌత్ కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఐపీఎస్, జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల, ఐపీఎస్ అధికారులకు సూచించారు. మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) ఎన్నికలు ఒకే దశలో, గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణపై బుధవారం సమీక్ష నిర్వహించారు. సౌత్ కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆధ్వర్యంలో నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లాలో ఎన్నికల సన్నద్ధత, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, పోలీసు బందోబస్తు, ముందస్తు భద్రతా చర్యలపై సమీక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

**ఐదు సబ్ డివిజన్ల అధికారులతో ఎస్పీ సమీక్ష** ఐజీ సమీక్ష అనంతరం జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఐదు పోలీసు సబ్ డివిజన్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సన్నద్ధత, సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాల గుర్తింపు, గత ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘర్షణలు, సమస్యాత్మక వ్యక్తులపై నిఘా, ముందస్తు చర్యలు, బందోబస్తు ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా** జిల్లాలోని ఐదు పోలీసు సబ్ డివిజన్ల పరిధిలో ఎన్నికల పరంగా సున్నితమైన గ్రామాలు, పట్టణ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో గుర్తించాలని ఎస్పీ ఆదేశించారు. గత ఎన్నికల్లో ఘర్షణలు, రాజకీయ వివాదాలు, పరస్పర దాడులు జరిగిన ప్రాంతాలను పరిశీలించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు.

**చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు** గతంలో ఎన్నికల వివాదాలు, ఘర్షణల్లో పాల్గొన్నవారితో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తుల కార్యకలాపాలపై చట్టపరిధిలో నిఘా ఉంచాలని ఎస్పీ సూచించారు. ఓటర్లను బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం, ప్రలోభాలకు గురిచేయడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే ఎలాంటి పక్షపాతం లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**పటిష్ట బందోబస్తుకు ప్రణాళిక** పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక గ్రామాలు, ప్రధాన కూడళ్ల వద్ద అవసరాలకు అనుగుణంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిబ్బందికి విధులు, బాధ్యతలను స్పష్టంగా కేటాయించి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా సమాచార వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం కొనసాగించాలని సూచించారు.

పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పూర్తిగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి, బెదిరింపులు లేకుండా తన ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పించడం పోలీసుల బాధ్యతని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశాల్లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సీహెచ్ సౌజన్య, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) అప్పారావు, నెల్లూరు టౌన్ ఏఎస్పీ దీక్ష, నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘటంనేని శ్రీనివాసరావు, కావలి డీఎస్పీ వీవీ రమణకుమార్‌తో పాటు జిల్లాలోని వివిధ సబ్ డివిజన్ల పోలీసు అధికారులు, సీఐలు, ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి ఓటరుకు భద్రత.. ప్రతి ఓటుకు గౌరవం కల్పిస్తూ ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందని అధికారులు తెలిపారు.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.